సీఎంకు కృతజ్ఞతలు



హస్తినాపురం: డివిజన్ పరిధిలోని మూసానగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె ముఖ్యమంత్రిని కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌ఎంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



చంపాపేట: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని క్రాంతినగర్‌లో పాదయాత్ర నిర్వహించి సీసీరోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారి రమ్యభారతి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆనంద్, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, జనార్ధన్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం జీవిత దానంతో సమానం

నాగోలు: రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనిషికి జీవితాన్ని దానం చేసినట్లే అని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముస్కు శేఖర్‌రెడ్డి 2వ వర్ధంతి వేడుకలు శుక్రవారం నాగోలు సాయినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి కుమారుడు ముస్కు లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

చంపాపేట: కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, విశాలమైన క్రీడా మైదానం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని చంపాపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నూతనంగా చేరిన చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల మానసిక స్థాయి ఆధారంగా మౌలిక విలువలతో కూడిన బోధన సాగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు తమకు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు లక్ష్మి, సుధేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, కావ్య , చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

చైతన్యపురి: డివిజన్‌లోని పలు కాలనీల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) పంకజకు వినతిపత్రం సమర్పించారు. 30 ఏళ్ల క్రితం వేసిన కాలనీల రహదారులు పూర్తిగా పాడైపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయినగర్, ఫణిగిరి కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీ, రామాలయం రోడ్డు, ప్రభాత్‌నగర్, గణేష్‌పురి కాలనీ, విద్యుత్‌నగర్, సత్యనారాయణ పురం కాలనీల్లో గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయని, నిధులు మంజూరు చేసి ఈ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు,. కార్పొరేటర్ వెంట స్థానికులు రామ్మోహన్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

19న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం

మన్సూరాబాద్: ఎంఆర్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు గుర్రాల శ్రీనివాస్ అధ్యక్షతన మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఎస్ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగా మాట్లాడుతూ, ఈ నెల 19న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తామన్నారు. జిల్లా మండల నియోజకవర్గ బాధ్యులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కొండ్రు శంకర్, చింతా బాబు మాదిగ, కేదాస్ మోహన్, పులిజాల గెలవయ్య, జీడీ నర్సింహ, లంక వెంకటేశ్వర్లు, చినబాబు, మంచాల యాదగిరి, శనగల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పట్టని అధికారులు: కొప్పుల

మన్సూరాబాద్: ఆగమయ్యనగర్ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతోందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీవరేజీ వ్యవస్థ నిర్వహణను జలమండలికి ఇవ్వొద్దని గతంలోనే ఎంత చెప్పినా వినలేదని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించటంలో జలమండలి పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాలనీవాసులు కొవ్వూరి యాదయ్య, అంతటి శ్రీరాములు, కరుణాకర్‌యాదవ్, భాస్కర్‌బాబు, ఆనందం, వెంకటయ్య, గుర్రం గోవర్ధన్ మంజుల పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డికి సత్కారం



సైదాబాద్: రక్తదానం చేయడం ఆపదలో ఉన్నవారికి ప్రాణ దానం చేయడంతో సమానమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు, మహావీర్ విద్యాసంస్థల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉస్మానియా హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ సూపరింటెంట్ డాక్టర్ నరేందర్, వైద్యాధికారులతో కలిసి సంరెడ్డి సురేందర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తమ మహావీర్ విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు ప్రతీ సంవత్సరం మూడుసార్లు ఉస్మానియా హాస్పిటల్‌లో రక్తదానం చేస్తారని, అందుకే తనను ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాలు ఫుల్

- ముమ్మరంగా కుటుంబ సర్వే
- లబ్ధిదారుల పూర్తి వివరాలు యాప్‌లో నమోదు

చాదర్‌ఘాట్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు పోషక పదార్థాల లబ్ధి సంపూర్ణంగా చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కౌమార బాలికలకు ఇచ్చే గుడ్లు, పాలు, బాలామృతం ఇతరత్రా పోషక పదార్థాలు సక్రమంగా అందేలా పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) పేరిట మలక్‌పేట సర్కిల్–6లో కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారు.

- సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసీడీఎస్ మలక్‌పేట పరిధి కిందకు వచ్చే సైదాబాద్, అక్బర్ బాగ్, మూసారాంబాగ్, అజంపురా, చావునీ పరిధిలో ఉన్న 274 అంగన్‌వాడీ కేంద్రాలు, 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.
- వీటిలో మొత్తం బాలింతలు 2000, గర్భిణులు 2100, 0–5 సంవత్సరాల లోపు పిల్లలు 29,700 ఉన్నట్లు ఐసీడీఎస్ మలక్‌పేట జోన్ అధికారి జ్యోత్స్న తెలిపారు. ఈ కేంద్రాల పరిధిలో కుటుంబ సర్వే ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తైందని ఆమె తెలిపారు. సర్వే ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పాలు, బాలామృతం వంటివి ప్రతినెలా లబ్ధిదారులకు అందేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు.



మలక్‌పేటలో కుటుంబ సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వివరాలు ఇలా నమోదు...

- సర్వేలో భాగంగా కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఉపకులం, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, వయసు, అంగవైకల్యం వంటి వివరాలను నమోదు చేస్తున్నారు.
- ఇందు కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేకంగా మొబైల్ ఫోన్లు అందించింది. మార్చి నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. చిన్నారుల బరువు, ఎత్తులను సైతం ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రయోజనాలు ఇవీ..

- అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే భోజనం, గుడ్లు, పాలు, బాలామృతం రికార్డుల ప్రకారం పంపిణీ చేస్తున్నారా లేదో తెలుసుకునేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుంది.
- అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేయడం వల్ల ప్రభుత్వం అందించే పోషక పదార్థాలు, ఇతర సామగ్రి ఇకపై సక్రమంగా అందుతాయి.
- గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి తమకు వచ్చే పౌష్టికారం తీసుకోకపోతే ఆ విషయం వారి మొబైల్ ఫోన్ మెస్సేజ్ రూపంలో వస్తుంది.



కుటుంబ వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

కొత్తపేట డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించండి

ఎల్బీనగర్ జెడ్సీకి కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి



నాగోలు: కొత్తపేట డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్ గాయత్రీ పురం కాలనీ, నాగేశ్వర్ నగర్, శ్రీ రామలింగేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ మీదుగా మూసీ నది వరకు బాక్స్ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఎస్ఆర్ఎల్ కాలనీ నుంచి గాయత్రి పురం కాలనీ వరకు ఈ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో అసంపూర్తిగా ఉండిపోయాయని తెలిపారు. ప్రధాన రోడ్డు మార్గం అంతా గుంతలు పడి అధ్వానంగా మారడంతో వాహనదారులు, కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతున్నాయన్నారు. వర్షా కాలంలో భారీ ఎత్తున వరద నీరు రోడ్డుపైకి చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఆగిపోయిన బాక్స్ డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేసి సీసీ రోడ్డు నిర్మించాలని జోనల్ కమిషనర్ కోరారు. అలాగే, సత్యనగర్, భరత్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ కాలనీలకు నూతన రోడ్లు మంజూరు చేయాలని జెడ్సీకి విజ్ఞప్తి చేశారు. నూతన రోడ్ల మంజూరుతో పాటు వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని జెడ్సీ అన్నారని పవన్‌కుమార్ తెలిపారు.

అర్ధరాత్రి రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్

- కర్రలతో ఒకరిపై దాడి
- ఏడుగురు నిందితుల అరెస్టు



జనార్దన్ నాయుడిపై దాడి చేస్తున్న గంజాయి బ్యాచ్

చైతన్యపురి: అర్ధరాత్రి గంజాయి, మద్యం తాగి గొడవ చేయొద్దని చెప్పిన ఇంటి యజమానిపై గంజాయి బ్యాచ్ కర్రలు, రాళ్లతో దాడి చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం.. చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలోని నేతాజీనగర్ కాలనీలోని ఓ ఖాళీ స్థలంలో గురువారం రాత్రి 2 గంటల ప్రాంతంలో కొంతమంది యువకులు మద్యం, గంజాయి గొడవ చేస్తున్నారు. సమీపంలో అద్దెకు ఉండే ఓ వ్యక్తి ఎందుకు అలా చేస్తున్నారని అడిగాడు. దీంతో వారు అతడి ఇంటిపై రాళ్లతో దాడి చేసి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఈ విషయంపై అతను ఇంటి యజమాని జనార్దన్‌నాయుడికి సమాచారం ఇవ్వగా..అతను వచ్చి పరిశీలిస్తుండగా గంజాయి బ్యాచ్ అతడిపై కర్రలతో దాడి చేసింది. స్థానికులు గుమికూడటంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. జనార్దన్‌నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలో దాడి చేసిన దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించారు. నిందితులు మిర్యాలగూడకు చెదిన మద్ది శంఖుయాదవ్ (25), ఎల్‌బీ నగర్ భరత్‌నగర్‌కు చెందిన గద్దెరాజు వంశీ(26), ఈదులకంటి మనోజ్(17), చేగోని హరీష్ (20), హయత్‌నగర్ బొమ్మలగుడికి చెందినో షాహిద్ (23), మహమ్మద్ సోను (19), మహ్మద్ రెహాన్ (16)లను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'ప్రభుత్వ భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోండి'

పంజగుట్ట: ప్రభుత్వ భూమి కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన సంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యాం సుందర్ గౌడ్ డిమాండ్‌చేశారు. శుక్రవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ ప్రతినిధులు హరిత్ రూథా, జిట్టా ఆయిల్ రెడ్డి, మారోజు రామాచారిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ ఈస్ట్ రంగారెడ్డి జిల్లా పరిధిలోని సరూర్‌నగర్ మండలం బహదూర్ గ్రామం సర్వే నెంబర్ 49/13లో మొత్తం 58 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ ఉండగా, అందులోని 1.20 గుంటల భూమిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు, 14 ఎకరాల 31 గుంటల భూమిని సిరీస్ ఫార్మా కంపెనీకి 1968 ఎకరానికి 3500 చొప్పున విక్రయించిందన్నారు. సిరీస్ కంపెనీ తనకు కేటాయించిన భూమి కాకుండా మరో 10 ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకుని డీమార్ట్, సృజన, టీఎంటీ, వీజన్ ఎలక్ట్రానిక్స్, వాసవి కన్‌స్ట్రక్షన్స్‌కు సుమారు వెయ్యి కోట్లకు విక్రయించిందని ఆరోపించారు.10 ఎకరాల కబ్జాపై తాము రంగారెడ్డి కలెక్టర్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, లోకాయుక్తలో ఫిర్యాదు చేశామన్నారు. లోకాయుక్త సదరు సంస్థకు నోటీసులు ఇచ్చి ఏడాదైనా ఇప్పటివరకు స్పందన లేదన్నారు. ప్రభుత్వం ఎంతో విలువైన ఆ భూమిని స్వాధీనం చేసుకుని కబ్జాదారులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

రియల్ ఎస్టేట్ పేరుతో రూ.5 కోట్లకు టోకరా!

- బాధితుడి ఫిర్యాదుతో మీర్‌పేట కార్పొరేటర్‌పై కేసు
- నిందితుడి అరెస్టు .. రిమాండ్‌కు తరలింపు



కార్పొరేటర్ నరేంద్రకుమార్

మీర్‌పేట: తప్పుడు పత్రాలు సృష్టించడంతో పాటు పొలం రిజిస్ట్రేషన్ చేయిస్తానని డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడిన కేసులో మీ ర్‌పేట కార్పొరేటర్‌ను పోలీసులు శుక్రవారం రి మాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనా థ్ కథనం ప్రకారం... మీర్‌పేట 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేంద్రకుమార్ (నందు) రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని.. తనకు పరిచయస్తుడైన చంపాపేట వాసి చిత్తోజు కృష్ణను నమ్మించాడు. ఈ క్రమంలో అతని నుంచి రూ.5 కోట్లు తీసుకుని కొంగరకలాన్‌లోని సర్వే నంబర్ 76అ, 74ఆ, 76ఆ, 75ఆ, 74ఇ, 74అ, 75ఇ, 75అలోని 6 ఎకరాల 17 గుంటల భూమిని..సంబంధిత యజమానులు తుమ్మల ధీరజ్‌రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్‌లతో కలిసి చిత్తోజు కృష్ణ, బొడ్డుపల్లి సతీష్‌కుమార్, మొక్క నరేంద్రకుమార్‌లకు విక్రయిస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఇచ్చాడు. అనంతరం భూములు రిజిస్ట్రేషన్ చేయించాలని కృష్ణ అడగగా వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు నేరుగా యజమానుల వద్దకు వెళ్లి ఆరా తీయగా తామెవరికీ పొలాలు అమ్మలేదని చెప్పడంతో కంగుతిన్నాడు. మోసపోయినట్లు గుర్తించి.. నందుపై మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు, రేపు న్యాయవాదులకు శిక్షణ తరగతులు

రంగారెడ్డి కోర్టులు: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో న్యాయవాదులకు జిల్లా కోర్టు ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఐలు ప్రధాన కార్యదర్శి వనజా మోతుకూరి తెలిపారు. కార్యక్రమాన్ని ఐలు జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బికాశ్ రంజన్ బట్టాచార్య, న్యాయవాదుల మండలి సభ్యుడు కొల్లి సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు.

ఉజాలేషా ఈద్గాలో బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



మలక్‌పేట: బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈద్గాలో ఏర్పాట్లు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌శాఖ, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి శుక్రవారం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఉజాలేషా ఈద్గాను సందర్శించి బక్రీద్ పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చేవారి సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, అధికారులు, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

వనస్థలి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

వనస్థలిపురం: స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలోని వనస్థలి శబరిమల అయ్యప్ప దేవస్థానం 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్ర వా రం ఘనంగా మొదలయ్యాయి. ఉదయం సుప్ర భాతం, హోమం, అభిషేకం, అర్చన, హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పడిపూజ నిర్వహించారు. ఆదివారం వరకూ నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ ఈ ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు గూ డూరు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్న ఓంకారం, కోశాధికారి కొమ్మిడి కృష్ణారెడ్డి తెలిపారు.

నాలాల పూడికతీత పనులు చేపట్టాలి

చంపాపేట: డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో భూగర్భ, ఓపెన్ నాలాల పూడికతీత పనులు చేపట్టి వర్షా కాలంలో ఏర్పడే వరద ముంపు సమస్యను నివారించాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. చంపాపేట డివిజన్‌లోని లోతట్టు కాలనీల ప్రతినిధులు శుక్రవారం రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఉమామహేశ్వర్, నర్సింహ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'పై సీబీఐ విచారణ చేపట్టాలి: ఎన్ఎస్‌యూఐ

మన్సూరాబాద్: నీట్ పరీక్షపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్, ఎల్‌బీనగర్ ప్రధాన కార్యదర్శి సాయితేజలు మాట్లాడుతూ, నీట్ నిర్వహణలో భారీ కుంభకోణం జరిగిందని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమీర్‌మాలిక్, సాయిగౌడ్, చైతన్య, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై నీరు నిలవకుండా చర్యలు



పూర్ణోదయా కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ప్రధాన, అంతర్గత రహదారులపై వరద నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకుంటామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పూర్ణోదయా కాలనీలో పర్యటించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఛిద్రమైన కాలనీలోని పలు రహదారులను ఆయన పరిశీలించారు. రహదారులపై నీరు నిలిచి పోతుండటంతో పలు రకాల ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆయనకు తెలియజేశారు. వెంటనే ఆయన జీహెచ్‌ఎంసీ సిబ్బందిని రప్పించి కాలనీలో పారిశుద్ధ్య నిర్వాహణ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులతో చర్చించి వర్షాలు కురిసే సమయంలో కాలనీలో సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారి సయ్యద్ మినాజ్, జీహెచ్‌ఎంసీ ఏఈ అన్సారీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాగోలు డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేటు విద్యా సంస్థల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ స్కూళ్లలో ప్రభుత్వ అనుమతి లేకుండా అదనపు తరగతులను నిర్వహించడమే కాకుండా తమ వద్దే పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలు కొలుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. చాలా పాఠశాలలకు సరైన తరగతి గదులు, ఆట స్థలాలు లేవని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను మూసి వేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా హర్షలత



దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కే పురం డివిజన్‌కు చెందిన తమలపాకుల హర్షలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



గడ్డిఅన్నారంలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదనన్ రెడ్డి శుక్రవారం డివిజన్‌లో పర్యటించారు. గడ్డిఅన్నారంలో డ్రైనేజీ పైప్‌పులైన్ పనులను, శాలివాహననగర్‌లో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాల మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. కాలనీవాసులను స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరగా, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల్లో జాప్యం జరిగితే సహించబోమని హెచ్చరించారు. పర్యటనలో బస్తీ నాయకులు ప్రభాకర్, ధన్‌రాజ్, బీజేపీ నాయకులు సందీప్, దినేష్, సంతోష్ తదితరులు ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సుల్లో ఏమైనా సమస్యలు ఉంటే సెల్ నం. 9959226249కు కాల్ చేసి డీఎంకు ఫిర్యాదు చేయడంతో పాటు మెరుగైనా సేవలందించేందుకు అవసరమైన సూచనలు కూడా చేయవచ్చని అన్నారు.

ఎన్జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు వాయిదా

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడానికి ఈ నెల 16న ఎన్నికలు జరగాల్సి ఉండగా ఈ విషయమై కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలను వాయిదా వేస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై న్యాయపరమైన సలహాలు, సూచనలు తీసుకుని ఎన్నికలకు సంబంధించి తదుపతి తేదీలను ప్రకటిస్తామని ఎన్నికల అధికారి వి.బాబూరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలోని (మూసానగర్) ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా (తెలుగు, ఇంగ్లీషు మీడియం) మారుస్తూ జీఓ జారీ చేసినందుకు శుక్రవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నందనవనం కాలనీలోని పాఠశాలలో 8వ తరగతి నుంచి 9వ తరగతిలోకి 88 మంది విద్యార్థులు వెళ్తున్నారని, వీరితోనే వచ్చే సంవత్సరం పదో తరగతి ప్రారంభం అవుతుందన్నారు. విద్యార్థులకు సరిపడ తరగతి గదులు నిర్మించేందుకు రూ. 44 లక్షలు మంజూరు చేయించామని సుధీర్‌రెడ్డి తెలిపారు. హస్తినాపురం డివిజన్ నాయకులు రమావత్ శ్రీనివాస్‌నాయక్, అనంతుల రాజిరెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాద పరస్పర సహకార సంఘం రజతోత్సవాల్లో భాగంగా శనివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి, జస్టిస్ టి మాధవీదేవి, జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ నగేశ్ భీమపాకతో పాటు పలు జిల్లా న్యాయమూర్తులు, సంఘం అధ్యక్షుడు ఆలుగడ్డల అనిల్ హాజరవుతారని సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి

నాగోలు: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ జైపురికాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆమె హాజరై కొత్తగా ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించి, ఆ పైస్థాయి తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లల్ని సర్కారు స్కూళ్లలోనే చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి , కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.